# కనుల పండువగా గణేశ్ నిమజ్జనం



బోథ్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

బోథ్, అక్టోబర్ 1 : బోథ్‌లో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ఆదివారం కనుల పండువగా సాగింది. 13 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించిన అనంతరం గణేశ్ మండపాల వారు శోభా యాత్ర చేపట్టారు. చైతన్య, హనుమాన్, పోచమ్మ గల్లీ, భగత్‌సింగ్‌చౌక్, మైసమ్మగల్లీ, అంబేద్కర్‌కాలనీ, లోకమాన్య తదితర గణేశ్ మండపాల వారు తమ విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగించారు. యువకులు నృత్యాలు చేశారు. కరత్వాడ (బోథ్) ప్రాజెక్టు వద్ద నిమజ్జనం చేశారు.

### ఆదిలాబాద్ డీఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు...

బోథ్‌లో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బోథ్ సీఐ భీమేశ్, బోథ్, బజార్‌హత్నూర్ ఎస్ఐలు రాములు, నరేశ్, పోలీసు సిబ్బంది, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పహారా కాశారు.

### గణేశ్ లడ్డూ @ 52 వేలు

పొచ్చెర గ్రామంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి హనుమాన్ రెడ్డి యూత్ గణేశ్ మండపం వారు లడ్డూకు వేలం నిర్వహించారు. వేలంలో అత్యధికంగా రూ 52,001కు పాటపాడి ఎడ్మల శోభ-చిన్నారెడ్డి దంపతులు లడ్డూను దక్కించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం గణేశ్ మండపం వారు కుటుంబీకులకు లడ్డూను అందజేశారు.



పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ ఉమేందర్

# తీరనున్న రోడ్డు కష్టాలు

- రూ.10 లక్షలు మంజూరు
- వాగుపై కాజ్‌వే నిర్మాణం

బోథ్, అక్టోబర్ 1 : ఆ గిరిజనుల రోడ్డు కష్టాలు తీరనున్నాయి. పొలాల మధ్యలోనున్న బురద మయం రోడ్డు గుండా నడవాల్సి పరిస్థితులు దూరం కానున్నాయి. కాజ్‌వే నిర్మాణం చేపట్ట నుండడంతో వాగుదాటే ఇబ్బందులు తొలగిపోనున్నాయి. బోథ్ మండలం పార్డీ(బీ) గ్రామ పంచాయతీ పరిధిలోని పరుపులపల్లె గిరిజనులు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. టీవిటీ నుంచి సుమారు కిలో మీటర్ దూరంలో ఉన్న గ్రామం వరకు రోడ్డు సౌకర్యం లేక దశాబ్దాల కాలంగా అవస్థలు పడుతున్నారు. రోడ్డు వేయాలని పల్లెకు వచ్చిన ప్రతి ఒక్కరిని వేడుకున్నారు. అయినా సీమాంధ్ర పాలకులు పట్టించుకోలేదు. గిరిజనుల కష్టాలు చూసి ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కి రోడ్డు విషయం గురించి విన్నివించారు. ఐటీడీఏ నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేశారు. ఫార్మేషన్ రోడ్డుతో పాటు వాగుపై చెక్‌డ్యాం కింది భాగంలో కాజ్‌వే నిర్మాణం చేపట్టనున్నారు. ఎట్టకేలకు తమ గ్రామానికి గ్రావెల్ రోడ్డు మంజూరు కావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ దారి కష్టాలు తీరుస్తున్న సర్కారును మర్చిపోలేమంటున్నారు.



పరుపులపల్లె గ్రామానికి పొలాల మధ్య నుంచి ఉన్న మట్టి రోడ్డు



టీవిటీ రోడ్డు వద్ద నిర్మించాల్సిన వంతెన

### రోడ్డు లేక అవస్థలు పడుతున్నాం...



రోడ్డు లేక అవస్థలు పడుతున్నాం. నిత్యావసర సరకులు, ప్రాణం బాగా లేకుంటే ఇతర గ్రామాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. మా గోడును పల్లెకు వచ్చిన ప్రతి ఒక్కరికీ చెప్పాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. గిప్పుడు శ్రీను సార్ పల్లెకు వస్తే రోడ్డు వేయించాలని కోరినం. రోడ్డు కోసం డబ్బులు వచ్చినందుకు సంతోషమైతున్నది. **- ఆత్రం కోత్మిబాయి, గ్రామస్తురాలు**

### పల్లెకు ప్రధాన సమస్య రోడ్డు లేకపోవడమే...



పల్లెకు ప్రధాన సమస్య రోడ్డు లేక పోవడమే. టీవిటీ నుంచి మా గ్రామానికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. వానకాలంలో అయితే మా పరిస్థితి మరి దారుణంగా మారుతున్నది. కాలినడకన వెళ్లాలన్నా ఇబ్బంది అవుతున్నది. గ్రావెలింగ్ రోడ్డు కోసం రూ.10 లక్షలు మంజూరైనట్లు ప్రొసీడింగ్ కాపీ వచ్చింది. ఈ పనులు పూర్తి కాగానే మెటల్, బీటీ రోడ్డు నిర్మిస్తే మా పల్లె సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. **- జుగ్నాక్ మారుతి, సర్పంచ్, పార్డీ(బీ)**

# స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

- డీఆర్డీవో కిషన్
- మండలాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు



నేరడిగొండ: కేజీబీవీలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

నేరడిగొండ, అక్టోబర్ 1 : స్వచ్ఛతలో ప్రజలు భాగస్వాములు కావాలని డీఆర్డీవో కిషన్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం నేరడిగొండలోని కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామంలో స్వచ్ఛతను పాటించాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. అనంతరం పరిసరాల శుభ్రత ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు, గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో శోభన, కేజీబీవీ ఎస్‌వో రజిని, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

### భీంపూర్‌లో శ్రమదానం

భీంపూర్, అక్టోబర్ 1 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. భీంపూర్‌లో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పీహెచ్‌సీ, పంచాయతీ కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత పనులు చేపట్టారు. వీధులను శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మడావి లింబాజీ, ఐకేపీ మహిళా సంఘాల ప్రతినిధులు, ఎన్‌వైకే జిల్లా కోఆర్డినేటర్ సుశీల్ బాడ్, సిబ్బంది, ఉపసర్పంచ్ జాదవ్ రవీందర్, నాయకులు రాథోడ్ ఉత్తమ్, ధరమ్‌సింగ్, పురుషోత్తం పాల్గొన్నారు.

తాంసి, అక్టోబర్ 1: గ్రామాల్లో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలని వైస్‌ఎంపీపీ ముచ్చ రేఖారఘు అన్నారు. మండల కేంద్రంతో పాటు గిరిగామ, వడ్డాడి, పొన్నారి, జామిడి, బండల్‌నాగాపూర్, కప్పర్ల, ఈదుల్లాసావర్గాం, హస్నాపూర్, పాలోడి, గోట్కురి, అంబుగాం, అట్నంగూడ, లింగూడ గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బందితో కలిసి శ్రమదానం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు స్వప్నారత్న ప్రకాశ్, సదానందం, వెంకన్న, తూర్పుబాయి యశ్వంత్, అండె అశోక్, అలాలి జ్యోతీనర్సింగ్, కుంట సరితాకేశవ రెడ్డి, భరత్ పాల్గొన్నారు.



తాంసి: అంబుగాంలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ తూర్పుబాయి యశ్వంత్

# 78వ రోజుకు చేరుకున్న దీక్షలు



దీక్షలో కూర్చున్న పదో తరగతి 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

బోథ్, అక్టోబర్ 1: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 78వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో బోథ్‌కు చెందిన 1992-93 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు కూర్చున్నారు. వీరికి వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంఘీభావం ప్రకటించారు.

# నిరంతరం పరిశుభ్రత చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

భీంపూర్, అక్టోబర్ 1 : గ్రామాల్లో నిరంతరం పరిశుభ్రత చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, పంచాయతీ కార్యాలయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ లాంటి జ్వరాలు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు అవసరమన్నారు. ప్రతి 15 రోజులకు ఒక సారి దోమల మందు ఫాగింగ్ చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వినోద్, ఏపీవో సంగీత ,ఏపీఎం ప్రసాద్, సర్పంచ్ లింబాజీ , వైద్యాధికారి నిఖిల్‌రాజ్, సిబ్బంది జ్ఞానేశ్వర్, గంగాధర్ ఉన్నారు.